సాక్షి
చిత్తూరు
ఆదివారం । 31 । ఆగస్టు । 2025



మాటలు..బంధానికి బీటలు

క్షణికావేశం.. మాట పట్టింపులు..ఆలుమగల అనుబంధానికి బీటలు వారుతున్నాయి. విడాకులు తీసుకుంటున్నారు. - 8లో



మద్యం బార్లు కొందరికే!

జిల్లాలో మద్యం బార్ల లక్కు కొందరికే కిక్కునిచ్చింది. మొత్తం 11 బార్లకు నోటిఫికేషన్ ఐదింటికే లైసెన్స్‌లు ఇచ్చారు. - 8లో



వి.కోట కవులకు సన్మానం

నెల్లూరులో జరిగిన ఓ కార్యక్రమంలో వి.కోటకు చెందిన కవులు కొఠారి వెంకటరత్నం, శాంతకుమారిని సన్మానించారు. - 8లో

అనింద్యుడిపై జనవంద్యుడు



ప్రేమ నయన.. వాత్సల్య పవన..దయా సాగర.. సకల శుభంకర..మూషక వాహనదారి.. కరుణా కావేరి! వందే వినాయకం..పరమ పావనం ..మురిసెను సకల భక్త జనం.. నిజ నిదర్శనం.. నీ దర్శనం! కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం స్వామివారు వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, కర్పూర హారతులు, భజన, నృత్య, వాద్య, బృందాల ప్రదర్శనల నడుమ మూషిక వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈసేవకు కాణిపాకం, తిరువణంపల్లె, అగరంపల్లె, కాణిపాకం పట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె గ్రామస్తుల విశ్వకర్మ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు.

- కాణిపాకం



న్యూస్‌రీల్

బోయకొండలో రూ.4.58 కోట్లతో అభివృద్ధి పనులు



ఈఓ ఏకాంబరం

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద ఆలయ నిధులు రూ.4.58 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం శనివారం తెలిపారు. ఆలయం వద్ద పనులు చేపట్టడానికి చీఫ్ ఇంజినీర్ జీవీఆర్ శేఖర్ నుంచి పరిపాలనపరమైన అనుమతులు పొందినట్లు పేర్కొన్నారు. ఆలయం వద్ద డార్మిటరీ హాలులో ఎస్ఎస్ క్యూల ఏర్పాటుకు రూ.1.20 కోట్లు, ఆలయ ప్రాంగణంలో డార్మిటరీ హాలు ప్లాట్ ఫారం నంబర్-2 నిర్మాణం కోసం రూ.90 లక్షలు, గంగాపురం వద్ద ఉన్న మెట్ల మార్గంలో జీఐ షీట్ షెడ్ ఏర్పాటుకు రూ.73 లక్షలు, పీఆర్ భవనానికి ఎదురుగా 4 పొంగల్ షెడ్లు ఏర్పాటుకు రూ.90 లక్షలు, డార్మిటరీ హాల్ సైడ్ ప్లాట్‌ఫారం వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.35 లక్షలు, ఆలయం ప్రాంగణంలో లోపలికి జాలీలతో కూడిన గ్రానైట్ ఫ్లోరింగ్ ఏర్పాటుకు రూ.17 లక్షలు, గోశాల నుంచి బస్టాండ్ వరకు ఇంటర్‌లాగింగ్ పేవర్ల ఏర్పాటుకు రూ.33 లక్షలు మంజూరుకు అనుమతి లభించినట్లు పేర్కొన్నారు.

పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు ఊరేగింపుగా తీసుకొస్తున్న అధికారులు

కాణిపాకం: వరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి శనివారం విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. ఆ దేవస్థాన ఈఓ శీనానాయక్, ప్రధాన అర్చకులు దుర్గా ప్రసాద్ సంప్రదాయ బద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించారు. వీరికి ఈఓ పెంచలకిషోర్ ఘనస్వాగతం పలికారు. శేషవస్త్రం, స్వామి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓలు కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ధనంజయ్య, ధనపాల్, సిబ్బంది కోదండపాణి, వాసు, బాలాజీనాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

2న పీవీకేఎన్‌లో ఉద్యోగమేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెప్టెంబర్ 2వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ మేళాలో ప్రముఖ 11 ఎంఎన్‌సీ కంపెనీలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 300 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. కనీసం పదో తరగతి నుంచి డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. 18- 35 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఇతర వివరాలకు 8465830771, 9963561755 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ బిల్లు కట్టవచ్చు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని విద్యుత్ వినియోగదారులు ఆదివారం కూడా బిల్లులు చెల్లించవచ్చని రెండు జిల్లాల ట్రాన్స్‌కో ఎస్ఈలు నరేంద్రనాథ్, సురేంద్రనాయుడు తెలిపారు. రెండు జిల్లాల్లోని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు ఆదివారం యథావిధిగా పనిచేస్తాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే హెచ్‌టీ సర్వీసుదారులు బిల్లులు పెండింగ్ లేకుండా సకాలంలో కట్టాలని వివరించారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆర్జేడీని కలిసిన ఉమ్మడి చిత్తూరు జిల్లా నాన్ టీచింగ్ అసోసియేషన్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కందాటి విశ్వేశ్వరరెడ్డి కోరారు. చిత్తూరు జిల్లాకు విచ్చేసిన ఇంటర్మీడియట్ ఆర్జేడీ సురేష్ కుమార్‌ను ఆ సంఘ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆర్జేడీతో నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు చర్చించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు నిర్వహించాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఆ అసోసియేషన్ నాయకులు ఆర్జేడీని పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ హరికృష్ణ, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు నజీర్ అహ్మద్, మాధవ నివాస్, చరణ్, సాయితేజ, ప్రతాప్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

జ్వరం.. చిగురుటాకులా జనం

జ్వరాలతో పల్లెలు, పట్టణాలు పడకేశాయి. ఏ పల్లె గడపతొక్కినా.. ఏ పట్టణంలో ఏ వీధికెళ్లినా జ్వరపీడితులు దర్శనమిస్తున్నారు. వర్షపు నీరు పలు చోట్ల నిల్వ చేరి, పారిశుధ్యం అధ్వాన్నంగా తయారైంది. ఫలితంగా జనంపై దోమలు దండెత్తుతున్నాయి. దోమకాటుకు గురై జనం మంచం పడుతున్నారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండదంతో పాటు వైరల్, డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. జ్వరాల బారిన పడిన జనం చిగురుటాకుల్లా వణికిపోతున్నారు.



- విజృంభిస్తున్న విషజ్వరాలు
- పడకేస్తున్న పల్లెలు
- పత్తాలేని అధికారులు
- ఆస్పత్రులు కిటకిట



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జ్వరాలతో చికిత్స పొందుతున్న చిన్నారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. డెంగీ, వైరల్ జ్వరాలతో పల్లెలు పడకేస్తున్నాయి. క్షేత్రస్థాయి అధికారుల అలసత్వంతో పల్లె వాసులు దోమకాటుకు గురై, వైరల్, విషజ్వరాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జలుబు, దగ్గు, జ్వరాలతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వద్ద జనం క్యూ కడుతున్నారు. నీటి నిల్వలు, దోమల ఆవాస కేంద్రాలు లేకుండా చేస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కనిపించడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో పెద్దమొత్తంలో డెంగీ, వైరల్ జ్వరాల బారిన పడి చికిత్స పొందుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు జ్వరం, దగ్గు, జలుబు, తల, ఒళ్లు, గొంతునొప్పితో బాధపడుతున్నారు. పలువురు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు.

విజృంభిస్తున్న వైరల్ జ్వరం

ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకపోవడం, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను, పిచ్చిమొక్కలు, నీటి నిల్వలపై వాటి యజమానులు దృష్టి సారించకపోవడంతో జిల్లాలో దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. పలు చోట్ల నీరు నిల్వ చేరడంతో దోమలు వృద్ధి చెందడంతో జనానికి కంటి మీద కునుకు లేకుండా పోతోంది. ఎక్కువగా డెంగీ లక్షణాలు ఉండడం, అందులోనూ చిన్నారులే ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఒకే ఇంట్లో నలుగురైదుగురు మంచం పట్టారు. నగరి, కార్వేటినగరం, చిత్తూరు, గుడిపాల, యాదమరి, తవణంపల్లి, బంగారుపాళెం, జీడీ నెల్లూరు, ఎస్ఆర్ పురం, పాలసముద్రం, పూతలపట్టు మండలాల్లో అధికంగా ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి.



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో క్యూ

రోగులతో ఆస్పత్రులు కిటకిట

జ్వరబాధితులతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. పేద మధ్య తరగతి ప్రజలు ఆర్థిక స్తోమత లేక వైద్యం కోసం స్థానికంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. ఫలితంగా ప్రభుత్వాస్పత్రుల్లో ఇన్‌పేషెంట్ల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఇదే అదునుగా భావించిన కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు ఫీజుల పేరుతో జ్వరపీడితులను పిండేస్తున్నాయి.

భయాందోళనలో ప్రజలు

రోజు రోజుకూ జ్వరాలు విజృంభిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వైద్య పరీక్షలు చేయించుకున్న జ్వర పీడితుల్లో టైఫాయిడ్, ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోయిన వారే ఎక్కువగా ఉన్నారు. కొంతమందికి తాత్కాలికంగా జ్వరం తగ్గుతున్నా, మరోవైపు ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గుతుండటంతో తీవ్ర కలవరం మొదలైంది.

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వివరాలు..

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి -	1
ఏరియా ఆస్పత్రులు -	4
సీహెచ్‌సీలు -	8
పీహెచ్‌సీలు -	50
అర్బన్ హెల్త్ సెంటర్లు -	15
ప్రైవేటు ఆస్పత్రులు -	1500

క్షేత్రస్థాయిలో సేవలేవీ..

పల్లెల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నా క్షేత్రస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యసిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రోగులు ఆందోళన చెందుతున్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి చైతన్యపర్చాల్సిన వైద్య సిబ్బంది ఆ విషయం మరిచిపోయారు. జిల్లాస్థాయి అధికారులు పట్టించుకోకపోవడంపై పల్లెవాసులు మండిపడుతున్నారు.



జనరల్ ఓపీలో పరీక్షిస్తున్న వైద్యులు

ఓపీ వివరాలు

తేదీ	సంఖ్య	తేదీ	సంఖ్య
ఆగస్టు 25	925	28	1,256
26	997	29	1,185
27	567	30	1,374

జ్వరాన్ని తేలికగా తీసుకోవద్దు



సీజనల్ ప్రభావంతో వైరల్ జ్వరాలు వస్తాయి. తలనొప్పి, జలుబు, గొంతునొప్పి, ఒళ్లునొప్పులు, తీవ్ర జ్వరం వస్తున్నాయి. దీంతో పాటు డెంగీ కూడా వస్తోంది. వీరికి ఒక్కరోజు మాత్రమే జ్వరం కనిపిస్తుంది. ప్లేట్‌లెట్ పడిపోతాయి. ఇలా అయితే 90 శాతం ఏమీ కాదు. 10 శాతం ప్రమాదకరమే. తక్షణమే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. తేలిక తీసుకోవద్దు.

– డాక్టర్ రవిరాజు, వైద్యనిపుణులు

జాగ్రత్తలు అవసరం



వైరల్ జ్వరాలు ఒకరి నుంచి మరొక్కరికి వ్యాపించే అవకాశాలుంటాయి. కచ్చితంగా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా చిన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. కాచి చలార్చిన నీటిని ఇవ్వాలి. మాస్కులు ధరించాలి. చిన్న పిల్లలకు జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వాస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో చూపించడం మంచిది. సొంత వైద్యం వద్దు. అలాగే పెద్దలు కూడా జ్వరమని మాత్రలు వేసుకుని ఇంటి పట్టునే ఉండిపోవడం మంచి కాదు. వైరల్ జ్వరాలపూ అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

– ఉషశ్రీ, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

పరిసరాల శుభ్రత అవసరం



దోమల పెరగకుండా ఇళ్ల ముందు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. జ్వర లక్షణాలు కనిపిస్తే ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవాలి. జ్వరాలు, ఇతర వ్యాధులకు సంబంధించిన ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. కచ్చితంగా పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉండేలా చూస్తాం. క్షేత్రస్థాయిలో పర్యటించి, జ్వరాల కట్టడికి చర్యలు తీసుకుంటాం.

– సుధారాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్ సద్దాం డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో ఉన్నతవిద్య చదివే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలో వేలాది మంది విద్యార్థులు కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్ పై ఆధారపడి డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ తదితర పలు కోర్సులు చదువుతున్నారన్నారు. సకాలంలో ఫీజు నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులతో పాటు కళాశాలల యాజమాన్యాలు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు కోర్సులు పూర్తి చేసినా సర్టిఫికెట్లు చేతికి అందక ఉద్యోగాలు పొందలేక నష్టపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలు మంజూరు చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

ఎస్వీ జూపార్కుకు నెమలి అప్పగింత



వడమాలపేట (పుత్తూరు): వడమాలపేటలో తిరుగుతున్న నెమలిని శనివారం అటవీశాఖ అధికారులు సురక్షితంగా పట్టుకుని ఎస్వీ జూపార్కు సిబ్బందికి అప్పగించారు. కార్యక్రమంలో పాపానాయుడుపేట సెక్షన్ ఆఫీసర్ శంకరప్ప, బీట్ ఆఫీసర్ మునినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుదాం



సమావేశంలో పాల్గొన్న పార్టీ నేతలు, శ్రేణులు



మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, చిత్రంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప

- బూత్, గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలి
- పుంగనూరు నియోజకవర్గ నాయకుల సమావేశంలో పెద్దిరెడ్డి

తిరుపతి మంగళం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుదామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్, పుంగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి మారుతీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ సంస్థాగత ఎన్నికల కమిటీ రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డితో కలిసి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నియోజకవర్గ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలను స్క్రీన్ ద్వారా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వజ్ర భాస్కర్‌రెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప, టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్‌తో పాటు పార్టీ శ్రేణులు తిలకించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ..మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాదన్నర కాలం అవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ కక్ష పూరిత రాజకీయాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. మోసపూరిత వాగ్దానాలతో రాజకీయ చరిత్రలోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న ఏకైక నాయకుడుగా చంద్రబాబు మిగిలిపోయారన్నారు. రాష్ట్రంలో, పుంగనూరు నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ శ్రమిద్దామని పిలుపునిచ్చారు. వచ్చే నెల 5వతేదీకి పుంగనూరు నియోజకవర్గంలో అన్ని కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు.

సభలకు రాకుంటే సంక్షేమ పథకాలు కట్

సంఘమిత్రల ద్వారా డ్వాక్రా సభ్యులపై ఒత్తిడి

- సవాలక్ష ఆంక్షలతో జలహారతికి తరలింపు
- సోషియల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆడియోలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: 'గ్రూపు సభ్యులు తప్పకుండా చంద్రబాబు సభలకు రావాలి. రాకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు కట్ అవుతాయి. పనులు కావాలంటే జరగవు. సార్లు నుంచి మాపై ఒత్తిళ్లు ఉన్నాయి. తప్పకుండా సభలకు రావాల్సిందే..' అంటూ షోషల్ మీడియాలో ఓ ఆడియో చక్కర్లు కొట్టింది. శనివారం కుప్పం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబునాయుడు చేపట్టిన జలహారతి కార్యక్రమానికి జనసమీకరణ కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు పడరానిపాట్లు పడ్డారు. రాష్ట్ర నలుమూలల నుంచి ఆర్టీసీ బస్సుల్లో జనసమీకరణ చేపట్టారు.

విద్యార్థుల తల్లిదండ్రులందరూ రావాలి

డ్వాక్రా గ్రూపు సభ్యులే కాకుండా స్థానికంగా ఉన్న ఓ ప్రవేట్ స్కూల్ యాజమాన్యం సైతం జనసమీకరణ చేపట్టింది. సీఎం ప్రోగ్రామ్‌లకు స్కూల్ బస్సులు పంపుతున్నాం.. విద్యార్థుల తల్లిదండ్రులందరూ తరలిరావాల్సిందే.. అంటూ ఓ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీన్ని బట్టి చూస్తే సీఎం జలహారతికి జనసమీకరణ ఏ స్థాయిలో జరిగిందే అర్థమవుతోంది.



జలహారతి కార్యక్రమలో పాల్గొన్న చంద్రబాబు

కుప్పం నియోజకవర్గంలో ప్రతి గ్రామానికీ ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి మరీ జనాన్ని తరలించారు. ఈ బస్సుల్లో ప్రధానంగా వెలుగు గ్రూపు సభ్యులే ఎక్కువగా కనిపించడం గమనార్హం. పుంగనూరు, మదనపల్లి, చిత్తూరు, ఒంగోలు నుంచి జన సమీకరణ చేపట్టారు. ప్రతి బస్సు పైనా అధికార పార్టీ పసుపు జెండా, సీఎం స్పెషల్ స్టిక్కర్లు ఏర్పాటు చేశారు. సీఎం ప్రోగ్రాంకు వచ్చే ప్రతి మహిళకూ ప్రత్యేక కిట్ ఏర్పాటు చేశారు. భోజనం ప్యాకెట్లతో పాటు ప్రత్యేకంగా తినుబండారాలు సమకూర్చారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి జనాన్ని తరలించారు.



జనసమీకరణకు కుప్పంలో తిరుగుతున్న ఆర్టీసీ

నేడు చిన్న, పెద్ద శేష వాహన సేవలు

కాణిపాకం: వరసిద్ధివినాయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారు చిన్న, పెద్ద శేషవాహన సేవలు నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. ఈ సేవకు ఉభయకర్తలుగా కాణిపాకం, కాకర్లవారిపల్లె, వడ్రాంపల్లె, మిట్టిండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, 44 బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లి, తిరువణంపల్లి, చిగరపల్లి, అగరంపల్లి గ్రామాల్లోని కమ్మ వంశస్తులు వ్యవహరించనున్నారని ఆలయాధికారులు తెలిపారు.

చిత్తూరు కోర్టులో మీసేవా కేంద్రాలు ప్రారంభం

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో కక్షిదారుల సౌలభ్యం కోసం మీ సేవా కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ తెలిపారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో రెండు మీసేవ కేంద్రాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ న్యాయస్థానాల్లో కేసుల విచారణకు సంబంధించి వివరాలన్నీ కూడా ఇక్కడున్న కంప్యూటర్‌లో పొందుపరిచామన్నారు. కక్షిదారులు తమ కేసులు ఏ స్థితిలో ఉన్నాయి ? ఎప్పుడు వాయిదా పడ్డాయి ? అనే వివరాలను ఉచితంగా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు.

వి.కోట కవులకు సన్మానం


వి.కోట: నెల్లూరులో వి.కోట మండలానికి చెందిన కవులు, రచయితలైన డాక్టర్ కవికోకిల కొతారి వెంకటరత్నం, డాక్టర్ గడ్డం శాంతకుమారిని ప్రశంసా పత్రం, జ్ఞాపికలతో శనివారం నిర్వాహకులు సన్మానించారు. ఏపీ సృజనాత్మకత, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం వారి సంయుక్త ఆధ్వర్యంలో తెలుగుబాషా ఉత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వి.కోటకు చెందిన కవులు కవితార్చన చేశారు. ఈ క్రమంలో వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎస్వీ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య చంద్రశేఖర్, ఆచార్య శిఖామణి, డాక్టర్ కొణిదల శోభ పాల్గొన్నారు.

నిప్పంటించుకున్న మహిళ మృతి


నాగవేణి(ఫైల్)

చౌడేపల్లె: పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని శుక్రవారం ఆత్మహత్యకు యత్నించిన పెద్దయల్ల కుంట్లకు చెందిన తోటి లీలావతి అలియాస్ నాగవేణి(49) శనివారం చికిత్స పొందుతూ తిరుపతి రుయా ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు. మృతురాలి తండ్రి తోటి రామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మాటలు..బంధానికి బీటలు



అ..అతడు.. ఆ.. ఆమె.. ఇద్దరూ పక్కపక్కనే ఉండే అక్షరాలు. నూరేళ్ల జీవితాన్ని ఆనందంగా ఆస్వాదించాల్సిన ఆలుమగలు. ఒకరికొకరం అనుకుంటూ ముందుకు నడవాల్సిన వారి మధ్య దూరం పెరుగుతోంది. కలిసి నడవాల్సిన పాదాలు తడబడుతున్నాయి. సర్దుకుపోలేమంటూ విడిపోయేందుకు సిద్ధపడుతున్నారు. మనస్సును మరింతగా మురిపించాల్సిన గిల్లికజ్జాల స్థానంలో అనుమానపు బీజాలు పడుతున్నాయి. చిలిపి చేష్టలు..అల్లరిగా గడపాల్సిన భార్యభర్తలు తమ జీవితాలను అల్లరిపాలు చేసుకుంటున్నారు. పని ఒత్తిడిలో మాటలు దూరమై.. కాపురాలు కాలదన్నుకునేంతవరకు వెళుతున్నారు. సరిదిద్దే పెద్దలు లేక ఎడముఖం..పెడముఖంగా సాగుతున్నారు. చివరకు ఈ కాపురం మావల్ల కాదంటూ విడిపోయేందుకు సిద్ధమవుతున్నారు.

మావిడాకులు వాడేలోపే విడాకులు

- వైవాహిక చట్రంలో ఇమడలేకున్న బంధాలు
- విడాకుల వైపు వడివడిగా పెరుగుతున్న అడుగులు
- విడిపోయాక కలిసి జీవించడంపై యువతరం ఆసక్తి
- స్వేచ్ఛ.. స్వాతంత్రం పేరిట నూతన బంధాలకు బాటలు
- జిల్లాకు పాకిన మహానగరాల సంస్కృతి

చిత్తూరు అర్బన్: పెళ్లంటే.. ప్రీ వెడ్డింట్ షూట్. ఎంగేజ్‌మెంట్ షూట్. బ్యాచ్‌లర్ పార్టీ. సంగీత్, మెహందీ.. ఆకాశమంత పందిరి.. మేళ తాళాలు. మూడు ముళ్లు. మరి ఆ మూడు ముళ్లు పడిన మూడు నెలల తరువాత..? విడాకుల కోసం కోర్టు మెట్లు ఎక్కడం. ఎంత వైభవంగా పెళ్లిళ్లు జరుగుతున్నాయో.. అంతే తొందరగా విడాకులకు సైతం ఉబలాట పడుతున్నారు. విడిపోయాక.. అదే జంట వాళ్లతోనే ప్రేమలో కూడా పడుతున్నారు. ఒకప్పుడు మహానగరాల్లో మాత్రమే కనిపిస్తున్న ఈ పోకడ.. ఇప్పుడు చిత్తూరు లాంటి నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లోనూ ఎక్కువగా కనిపిస్తోంది.

అర్థం కావడంలేదు

ప్రస్తుతం పెళ్లిళ్లు చేసుకుంటున్న యువతరానికి వైవాహిక బంధం అంత సులువుగా అర్థం కావడం లేదు. ప్రేమ, పెళ్లి వరకు ఉంటున్న ఆసక్తి.. పెళ్లి తరువాత కొనసాగనంటోంది. ప్రేమికులుగా ఉన్నపుడు బాధ్యత ఉండదు. మూడుముళ్లు పడేటప్పుడు వర్ణించడానికి వీలుకాని మధుర క్షణాలు.. అటు తరువాత నిలకడగా ఉండడంలేదు. దీనికి కారణం ఒకరినొకరు అర్థం చేసుకోకపోవడమేనని మానసిక వైద్య నిపుణులు, మధ్యవర్తిత్వం చేసే కౌన్సెలర్లు స్పష్టం చేస్తున్నారు. పెళ్లయిన కొత్త జంటలో ఒకరు ఉద్యోగం చేస్తుంటే, మరొకరు ఇంట్లో ఒంటరిగా ఉండలేక.. కుటుంబ సభ్యులతో మనస్తత్వం కలవక.. విడాకులవైపు అడుగులు వేస్తున్నారు. ఒకవేళ ఇద్దరూ ఉద్యోగులైతే ఇక్కడ కూడా చాలా జంటల్లో సమస్య తలెత్తుతోంది. ఇంటి పనుల్లో ఇద్దరి మధ్య సమన్వయం కుదరకపోవడం, పనిచేసే ఆఫీసులో ఎదురయ్యే ఒత్తిడి, సమస్యలు భాగస్వామిపై చూపించేసి.. ఇక కలిసి ఉండలేమని నెలల్లోనే నిర్ణయాలు తీసేసుకుంటున్నారు. ఒక్క చిత్తూరు నగరంలోనే గత ఎనిమిది నెలల్లో 183 మంది విడాకుల కోసం కోర్టు మెట్లక్కారు. ఇందులో పెళ్లయిన సంవత్సరంలోపు విడాకుల కోరుకుంటున్న వారి సంఖ్య 32 శాతం ఉండడం వివాహ బంధంపై ఉన్న నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తోంది.

విడిపోయి ఒక్కటిగా..!

చిత్తూరు నగరానికి చెందిన శుభ ప్రభుత్వ ఉద్యోగి. భర్త లలిత్ అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్.. రెండేళ్లపాటు సాగిన వీళ్ల దాంపత్యానికి ఇటీవల గుడ్‌బై చెప్పి, విడాకులు తీసుకున్నారు. విడాకులు తీసుకున్న మూడు నెలల తరువాత తరచూ ఈ జంట కలుస్తుండడం, సినిమాలు, షాపింగ్‌లకు వెళ్లడం.. అటు తరువాత ఎవరి ఇంటికి వాళ్లు వెళ్లిపోవడం. ఇటీవల ట్రెండ్‌లోకి వచ్చిన ఈ పద్ధతులను క్యాజువల్, నాన్-కమిటెడ్ రిలేషన్, వన్ నైట్ స్టాండ్, షార్ట్‌టర్మ్, లో-ఇంటిమెసీ రిలేషన్‌షిప్ లాంటి రకరకాల సహ జీవన విధానాలు సామాజిక మాధ్యమాల ద్వారా అందరికీ తెలుస్తున్నాయి. పెళ్లి లాంటి బంధాలకన్నా.. మనసులో ఉన్నది ఉన్నట్టు చెబుతూ, తమకు కావాల్సిన బంధాలను కొనసాగిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు నమోదైన విడాకుల కేసులు

ప్రాంతం	విడాకుల కేసులు
చిత్తూరు	183
తిరుపతి	192
పలమనేరు	118
పుంగనూరు	41
పుత్తూరు	56
శ్రీకాళహస్తి	69
పీలేరు	91

విడగొడుతున్న 'సెల్' భూతం

దంపతులు విడిపోతుండటానికి ప్రధాన కారణం మాత్రం సెల్‌ఫోన్‌గా తెలుస్తోంది. కొత్తగా పెళ్లయిన జంటలు అర్ధరాత్రి వరకు సోషల్ మీడియాలో గడుపుతుండడం, తన భాగస్వామిని పట్టించుకోకుండా ఆన్‌లైన్ గేమ్స్ ఆడడం, కొందరు అవధుల్లేని విశృంఖల కోరికలు కోరడం లాంటివి అవతలి వ్యక్తికి జీవితంపై విరక్తి పుట్టిస్తోంది. ఇటీవల చిత్తూరు పోలీసుల వద్దకు కౌన్సెలింగ్‌కు వచ్చిన ఓ జంట 'మాకు పెళ్లయ్యి 38 రోజులయ్యింది. నా భర్త వేకువజామున 3 గంటల వరకు కూడా పబ్జీ ఆడుకుంటున్నాడు. ఒక రోజు, రెండు రోజులు.. కానీ ప్రతిరోజూ ఇదే తంతు. ఇతనితో కలిసి ఉండడం నావల్ల కాదు..' అంటూ 22 ఏళ్ల యువతి తన ఆవేదనను వ్యక్తం చేయడం అక్కడున్న కౌన్సెలర్లను ఆశ్చర్యానికి గురిచేసింది. పడకగదిలోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లడం తమ ప్రేమానురాగాలు, దాంపత్యజీవితాన్ని మూడో వ్యక్తికి చూపించడమే అవుతుందని చాలా మందికి అర్థం కావడంలేదు.

సర్దుకుంటున్న వాళ్లు చాలా తక్కువ..



విడాకుల కోసం న్యాయస్థానం మెట్లుకెక్కుతున్న జంటలకు మేము కౌన్సెలింగ్ ఇస్తుంటాం. ఈ మధ్య ఒకటి గమనించాం. దంపతులు సర్దుకోవడం, మళ్లీ కలిసి ఉండడం అనే ప్రస్తావనను ఏమాత్రం ఒప్పుకోనంటున్నారు. ఆర్థిక స్థిరత్వం ఉన్నవాళ్లు అస్సలు కలిసి ఉండడానికి ఇష్టపడడంలేదు. మారుతున్న తరాలకు మధ్య స్వేచ్ఛ, ఒంటరితనం, నచ్చినట్టు బతకడం, భర్త-భార్య ఒకరినొకరు ప్రశ్నించకుండా ఉండాలనుకోవడం లాంటివి ఎక్కువగా కోరుకుంటున్నారు.
– చక్రవర్తిరెడ్డి, న్యాయవాది, చిత్తూరు

చట్టపరంగానే..



వివాహ బంధం గొప్పదే. కానీ ఒకరిపై ఒకరికి తప్పకుండా గౌరవం, నమ్మకం ఉండాలి. అవిలేకుండా చాలా మంది విడిపోవడానికి మొగ్గు చూపిస్తున్నారు. ఇంట్లో గొడవ అని వచ్చే దంపతులకు మంచీ- చెడు చెప్పి కౌన్సెలింగ్ ఇచ్చి పంపిస్తున్నాం. ఇక కలిసి ఉండలేము, కేసులు పెట్టండి అని కొందరు వస్తుంటారు. మెయింటెనెన్స్, భరణం కోసం వచ్చేవాళ్లకు చట్టపరంగా ముందుకు వెళ్లాలని సూచిస్తున్నాం.
– టి.సాయినాథ్, డీఎస్పీ, చిత్తూరు

పంటలపై ఆగని గజదాడులు


నూనేవారిపల్లి వద్ద ఏనుగులు ధ్వంసం చేసిన వరిపంట

పలమనేరు: కుంకీ ఏనుగులతో అడవిలోని ఏనుగులు పంటల పైకి రాకుండా కట్టడి చేస్తామంటూ స్థానిక ఫారెస్ట్ అధికారులు ఎన్ని మాటలు చెబుతున్నా రైతుల సాగు చేసిన పంటలకు ఏనుగులు నష్టం కలిగిస్తూనే ఉన్నాయి. తాజాగా శుక్రవారం రాత్రి నూనేవారిపల్లి సమీపంలోని పలువురు రైతులకు చెందిన వరి పంటను ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. ముఖ్యంగా ఒంటరి ఏనుగు తరచూ పంటలపై ఎక్కువగా పడుతోందని ఆ గ్రామస్తులు తెలిపారు. కౌండిన్య అడవిలో నుంచి ఏనుగులు పొలాల్లోకి రాకుండా ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పులిచెర్ల మండలంలో..


చల్లావారిపల్లె వద్ద ఏనుగులు నాశనం చేసిన వేరుశనగ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని చల్లావారిపల్లె సమీపంలోని పంట పొలాలపై ఏనుగుల గుంపు దాడి చేసి పంటలను నాశనం చేశాయి. వారం రోజులుగా చుట్టు పక్కలా ఎక్కడా కనిపించని ఏనుగులు మళ్లీ శనివారం తెల్లవారుజామున రామచంద్ర పొలంలో సాగు చేసిన వేరుశనగ, రాగి పంటలను తొక్కి, పీకి నాశనం చేశాయి. మామిడితోట కంచెగా ఉన్న కలబందను తొక్కేశాయి. పంట చేతి కొచ్చే సమయంలో ఇలా నాశనం చేయడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. దాదాపు ఐదు ఏనుగుల గుంపు చల్లావారిపల్లె పరిసర ప్రాంతాల్లోని పంటలపై పడి నాశనం చేశాయి.

విద్యుత్ షాక్‌తో వివాహిత..


సుమతి(ఫైల్)

కార్వేటినగరం: విద్యుత్ షాక్‌తో వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలోని ఆర్కేవీబీ పేటలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ కథనం మేరకు.. ఇందిరా కాలనీకి చెందిన నాగూరయ్య కుమార్తె సుమతి(39)ని ఆర్కేవీబీ పేట గ్రామానికి చెందిన నాగయ్యకు ఇచ్చి 20 ఏళ్ల కిందట వివాహం చేశారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శనివారం ఉదయం ఇంట్లోని లైట్ స్విచ్ ఆన్ చేసింది. అయితే లైట్ వెలగక పోవడంతో వైర్‌ను కదిలించే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హుటాహుటినా కార్వేటినగరం సీహెచ్‌సీకి తరలించారు. వైద్య సిబ్బంది పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం సుమతి భర్త నాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యం బార్లు కొందరికే..!

- జిల్లాలో ఐదు బార్లకే లైసెన్సుల జారీ
- మిగిలిన ఆరు బార్లు నేటి నుంచి మూత
- అవే ఫీజులతో త్వరలో రీ-నోటిఫికేషన్

చిత్తూరు అర్బన్: జిల్లాలో మద్యం బార్ల లక్కు కొందరికే కిక్కునిచ్చింది. మొత్తం 11 బార్లకు లైసెన్సులు జారీ చేయడానికి అధికారులు ఇచ్చిన నోటిఫికేషన్‌లో తొలివిడతగా ఐదు బార్లకు మాత్రమే లైసెన్సులు దక్కాయి. మిగిలిన ఆరు బార్లకు ఎవరూ దరఖాస్తులు చేసుకోలేదు. శనివారం చిత్తూరు కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి, అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్, జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో లక్కీ డిప్ నిర్వహించారు.

మహిళలూ పోటీ..

చిత్తూరులో 7, పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరి మునిసిపాలిటీల్లో ఒక్కో బార్ చొప్పున మొత్తం 11 బార్లకు అధికారులు ఈనెల 18న నోటిఫికేషన్ జారీ చేశారు. చిత్తూరులోని ఏడు బార్లలో ఒకటి కల్లుగీత సామాజికవర్గానికి 50 శాతం లైసెన్సు ఫీజు రాయితీ ఇచ్చారు. అయితే లైసెన్సు ఫీజులు భారీగా తగ్గించాలని కూటమి పార్టీకి చెందిన పలువురు ప్లాన్‌చేసి, దరఖాస్తులు వేయకుండా బ్లాక్‌మెయిల్‌కు దిగినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనికితోడు ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తేనే, లాటరీ పద్ధతి నిర్వహిస్తామని షరతు పెట్టడం కూడా సిండికేట్‌కు మింగుడుపడలేదు. ఈ నేపథ్యంలో చిత్తూరులోని మూడు మద్యం బార్లకు 12 దరఖాస్తులు, కుప్పం, పుంగనూరుకు కలిపి ఎనిమిది దరఖాస్తులు పడ్డాయి. చిత్తూరు కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో టోకెన్లు తీసి దరఖాస్తు చేసుకున్న నలుగురిలో ఒకర్ని అదృష్టవంతులుగా ఎంపిక చేసి లైసెన్సులు జారీ చేశారు. చిత్తూరులో గీత సామాజిక వర్గానికి చెందిన మహిళ, కుప్పంలో మరో మహిళ బార్ కోసం దరఖాస్తు చేసుకున్నా.. వాళ్లను అదృష్టం వరించలేదు. చిత్తూరులో రెండు బార్లను దక్కించుకున్నవారిలో.. ఒక్కొక్క బార్‌కు నాలుగు దరఖాస్తులను ఒకరే వేసుకుని లైసెన్సు చేజిక్కించుకున్నారు. మూడేళ్ల పాటు చెల్లుబాటయ్యేలా బార్ లైసెన్సులు జారీ చేస్తున్నారు.

నేటి నుంచి అవి మూత..

జిల్లాలో ఆరు మద్యం బార్లకు ఎవరూ దరఖాస్తు చేసుకోకపోవడంతో ఆదివారం రాత్రి 11 గంటలకు వాటిని అధికారులు మూసేయనున్నారు. పలమనేరు, నగరిలోని బార్లతో పాటు చిత్తూరులోని నాలుగు ప్రధాన బార్ల నిర్వహణకు ఎవరూ దరఖాస్తు చేసుకోకపోవడంతో అవి మూతపడనున్నాయి. ఇక్కడున్న మద్యంను అధికారులు స్వాధీనం చేసుకుని, డిపోకు తరలిస్తారు. వాటి విలువను లెక్కించి, బార్ యజమానికి నగదుగా చెల్లించనున్నారు. ఇక దరఖాస్తులు రానటువంటి ఆరు బార్లకు ప్రభుత్వం త్వరలోనే రీ-నోటిఫికేషన్ ఇవ్వనుంది. ఇప్పటికే నిర్ణయించిన లైసెన్సు ఫీజులు, నిబంధనలతో రీ-నోటిఫికేషన్ వెలువడచ్చని అబ్కారీశాఖ అధికారులు భావిస్తున్నారు.



కారు ఢీకొని కూలీ దుర్మరణం


జయచంద్ర మృతదేహం

రొంపిచెర్ల: రోడ్డు దాటుతున్న దినసరి కూలీని కారు వేగం వచ్చి ఢీ కొనడంతో అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన బెంగళూరు-తిరుపతి జాతీయ రహదారిలో శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రొంపిచెర్ల మండలం చల్లావారి పల్లెకు చెందిన జయచంద్ర(37) బండ కొట్టే కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తాడు. అతడు శనివారం రాత్రి 7.10 గంటలకు రొంపిచెర్ల క్రాస్‌లో రోడ్డు దాటుతుండగా పీలేరు వైపు నుంచి తిరుపతి వైపు వెళ్లతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో జయచంద్ర అక్కడిక్కడే మృతి చెందారు. మృతునికి భార్య ఈశ్వరి, కుమారులు యోగానంద్(15), దేవేంద్ర (14) ఉన్నారు. మృతుని భార్య ఈశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుయాలో జీడీ నెల్లూరు వాసి మృతి



గంగాధరనెల్లూరు: తిరుపతి రుయా ఆస్పత్రిలో ఓ వ్యక్తి మృతి చెందాడని, ఆస్పత్రిలో నమోదైన వివరాల మేరకు అతడు జీడీ నెల్లూరు వాసిగా గుర్తించారని, ఎవరైనా మృతుడిని గుర్తిస్తే వివరాలు తెలపాలని స్థానిక పోలీసులు ఓ ప్రకటన విడుదల చేశారు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి రుయా ఆస్పత్రిలో ఓ వ్యక్తి మృతి చెందాడని, అతడి ఓపి రిజిస్ట్రేషన్ ను పరిశీలించగా చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం, వేల్కూరు గ్రామానికి చెందిన ఉమామహేష్ (36)గా ఓపీ చీటీలో నమోదు చేసినట్లు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆస్పత్రిలో చేర్పించినట్టు సమాచారం. పోలీసుల విచారణలో తప్పుడు చిరునామాగా అనుమానిస్తూ, మృతుడిని ఎవరైనా గుర్తిస్తే తిరుపతి వెస్ట్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు..


నారాయణమ్మ మృతదేహం

తవణంపల్లె: ద్విచక్ర వాహనాంలో ప్రయాణిస్తున్న వృద్ధురాలిని ఆర్టీసి బస్సు వెనుక వైపు నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శనివారం తవణంపల్లెలో జరిగింది. తవణంపల్లె ఎస్‌ఐ చిరంజీవి కథనం మేరకు.. గంగవరం మండలం కీలపట్ల హరిజనవాడకు చెందిన టి. నారాయణమ్మ(74), తన మనవడు టి.మునీంద్రతో కలసి మోటార్ సైకిల్‌లో కాణిపాకం గుడికి వెళుతుండగా చిత్తూరు-అరగొండ ప్రధాన రహదారిలోని తవణంపల్లెలో ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి, వెనుక వైపు ఢీకొంది. దీంతో వృద్ధురాలు కిందపడడంతో బస్సు వెనుక టైరు తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందినది. మృతురాలు మనవడు మునీంద్రకు స్వల్ప గాయాలు తగిలి ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డాడు. మునీంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.